




# మన మహతి న్యూస్

సత్యం... సమగ్రత... సమాజం కోసం...

నిజమైన వార్తలు | నిర్దిష్టకు విశ్లేషణ | ప్రజల గొంతుక




ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | ఆదివారం సెప్టెంబర్ 06, 2026 | సంపుటి : 01 సంచిక : 2032 | పేజీలు 8 వెల-5/- MANAMAHATINEWS.COM

## మోదీ తెలివైన వారు.. ఆయన చెప్పినట్లు చేయాలి: బెల్జియం ప్రధాని



ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (విధిస్తున్న సుంకాలపై బెల్జియం ప్రధాని పరోక్ష విమర్శలు చేశారు.

'ఈ రోజుల్లో అడ్డంకులు పెంచాలని, మార్కెట్లను మూసివేయాలని, సుంకాలు విధించాలని చాలా మంది పిలుపునిస్తున్నారు.

కొందరు ఈ రోజు తీసుకున్న నిర్ణయాన్ని రేపు రద్దు చేస్తారు. ఎల్లుండి మళ్లీ పునరుద్ధరిస్తారు.

నేను ఎవరి గురించి మాట్లాడుతున్నానో మీకు తెలిసే ఉంటుంది.

అటువంటి వారి వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

మిగతాది 2లో



## పికాక్స్ పర్వతంపై త్వరలో భారీ దాడులు: ట్రంప్ మరో వార్నింగ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని 'పికాక్స్ పర్వతం' కింద ఉన్న భూగర్భ అణు కేంద్రంపై త్వరలోనే దాడిచేస్తామని అన్నారు. అక్కడ జరిగే అణు కార్యకలాపాలను అగ్రరాజ్యం నిశితంగా గమనిస్తోందని తెలిపారు.

మిగతాది 2లో

## మిస్ వరల్డ్‌గా డొమినికన్ రిపబ్లిక్ భామ




మిస్ వరల్డ్ 2026 టైటిల్‌ను డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జొహైరీ మోలా దక్కించుకున్నారు. మిస్ వరల్డ్ 2025 ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ (థాయ్‌లాండ్) ఆమెకు అందాల కిరీటాన్ని బహూకరించారు. వియత్నాంలో జరిగిన ఈ పోటీల్లో 110 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొన్నారు.

## 2029లోగా ఏపీలో మరో మూడు డీఎస్సీలు: మంత్రి లోకేశ్



మిగతాది 2లో

డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.

విజయవాడ ఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో లోకేశ్ మాట్లాడారు.

"కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి.

14 డీఎస్సీలు వేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు. మా ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. మా ప్రభుత్వంలో ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. 2029లోగా మరో మూడు డీఎస్సీలు వస్తాయి.పిల్లలను గొప్పవాళ్లుగా తయారు చేసే అద్భుతమైన అవకాశం టీచర్లకే ఉంది. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. టీచర్లను విదేశాలకు పంపిస్తున్నాం. అక్కడ స్టడీ చేసి రావాలని కోరుతున్నాం. ప్రాక్టికల్ విద్య అందిస్తేనే పిల్లలు అద్భుతాలు చేస్తారు. విద్యాశాఖలో ఏపీ మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలి.

## సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు: సీఎం చంద్రబాబు

విజయవాడ: సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులంతా ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లేనని చెప్పారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు. "1991 నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పోటీతో పాటు అవకాశాలు పెరిగాయి. టెక్నాలజీతో మంచి చెడు రెండూ ఉన్నాయి. నేటి కాలంలో బోధనా విధానం పూర్తిగా మారింది. మా చిన్నప్పుడు టీచర్లు బాగా కొట్టేవారు. భయభక్తులతో చదువుకునే వాళ్లం. టీచర్‌తో దెబ్బలు తిన్నవారంతా బాగుపడతారు.




## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి: - కేటీఆర్

కరీంనగర్: కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని.. తెలంగాణ తెచ్చిన ఆయన రాజీనామా చేయాలా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని డా.బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు.



## కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి..

### సీఎం రేవంత్ సవాల్



మిగతాది 2లో

నకిరేకల్: బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి చరిత్రను ప్రజలు గమనించాలని కోరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 100 పడకల ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు

"బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు.



## ప్రజలను ఇబ్బందిపెట్టేలా ఏపీ పేపర్‌మిల్లు వ్యవహరిస్తోంది:

కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుంటే.. రాజమహేంద్రవరంలోని ఏపీ పేపర్ మిల్లు మాత్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని దుర్గంధభరితం చేస్తూ.. పట్టణాలు, గ్రామాలకు స్వచ్ఛ జలాలు ఇవ్వకుండా చేస్తున్న విధానాన్ని పేపర్ మిల్లు సరిచేసుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. అందుకు తామే నాయకత్వం వహించినా ఆశ్చర్యం అవసరంలేదన్నారు.

# సంపాదకీయం

## ప్రజాస్వామ్యానికి శక్తులు ఉడిగాయా? ఉన్నాయా?

క్రమబద్ధంగా జరిగే ఎన్నికలూ, అధిక సంఖ్యలో పాల్గొనే ఓటర్లూ, శాంతియుతంగా ప్రభుత్వాలు మారటాలూ.. ప్రజాస్వామ్యమంటే ఇదే అనుకుంటాం. ఇలా చూస్తే మన ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే ఘనమైందిగా కనిపిస్తుంది. ఏ దేశమూ మనకు సాటిరానిదిగానే అనిపిస్తుంది. దీన్నే అసలుసిసలైన ప్రజాస్వామ్యంగా భావిస్తే అందరికంటే ర్యాంకుల్లో మనమే ముందుంటాం. కానీ వీ--డెమ్ (వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ) ఇనిస్టిట్యూట్ తాజాగా మన ప్రజాస్వామ్యానికి ఇచ్చిన ర్యాంకు చాలా దయనీయంగా ఉంది. 179 దేశాల్లో భారత్‌కు 106వ స్థానం లభించింది. కిందటి ఏడాది 100వ ర్యాంకు ఉంటే అది ఈ ఏడాది 106కు పడిపోయింది. అన్నిరకాల ప్రాథమిక హక్కులను హరించివేసిన 1975 నాటి ఎమర్జన్సీ కాలం తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఇంతటి దుస్థితికి దిగజారటం ఇప్పుడేనని వీ--డెమ్ నివేదిక పేర్కొంది.

ఎన్నికల ద్వారా అధికారాన్ని కైవసం చేసుకునే పార్టీలూ, నేతలూ నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తూ, అసమ్మతిని నయానాభయానా అణచి, వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసి.. తమకు ఎదురులేని రీతిలో వ్యవహారాలను నడపటాన్ని 'ఎలక్టొరల్ అటోక్రసీ'గా వర్ణించటం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. భారత్‌ను ఆ కోవలోకి చేర్చటమే కాదు... తాజా నివేదికలో మన దేశాన్ని పాకిస్థాన్, కజకిస్థాన్ సరసన వీడెమ్ నివేదిక నిలబెట్టింది. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం లోపించటం, ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తితో వ్యవహరించలేకపోవటం, ప్రభుత్వ యంత్రాంగంలో నిష్పాక్షికత గణనీయంగా క్షీణించటం అనేవి ఒక ప్రజాస్వామ్య దేశంగా భారత్ ర్యాంకు పడిపోవటానికి కారణాలుగా వీ--డెమ్ వ్యాఖ్యానించింది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు అడ్డంకులూ, పౌరసమాజానికి తన గళం వినిపించటంలో వివిధ రూపాల్లో ఎదురయ్యే ఇబ్బందులూ భారత ప్రజాస్వామ్య నాణ్యతను బాగా దెబ్బతీశాయని కూడా విమర్శించింది. ఎలక్టొరల్ అటోక్రసీ మీదే గాక, 'డెమొక్రటిక్ బ్యాక్‌స్లైడింగ్' అనే పేరు మీద కూడా ఇటీవల కాలంలో చాలా రచనలు వచ్చాయి. ఎలక్టొరల్ అటోక్రసీ అన్నా, డెమొక్రటిక్ బ్యాక్‌స్లైడింగ్ అన్నా అర్థంలో పెద్దగా తేడాలేదు. ప్రజాస్వామ్యం అన్ని విధాలుగా దిగజారి ఆలోచనల్లో ఆచరణలో నియంతృత్వ ధోరణులు పెరుగుతున్నాయని చెప్పటానికే ఆ రెండు పదబంధాలను వాడుతున్నారు.

ప్రజాస్వామ్య క్షీణతా, నియంతృత్వ ధోరణుల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ప్రబలం అవుతుంటే, వాటి తాలూకూ విపరిణామాల వల్ల నష్టపోయేది సాధారణ ప్రజలే. ముఖ్యంగా పెద్దగా ఆస్తిపాస్తులూ లేకుండా వేతనాల మీద ఆధారపడేవారే అందులో ప్రధానంగా ఉంటారు. సంపదలో, ఆదాయంలో వాటా తక్కువగా ఉన్నవాళ్లే గొంతెత్తాల్సి వస్తుంది. అలా ఎత్తే అవకాశాలను తగ్గించటం ప్రజాస్వామ్య దేశాల్లో కూడా ఎక్కువవుతోంది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో మత, జాతి విద్వేషాల చుట్టూ ప్రజలను ఊపేసే నాయకులు రంగం మీదకు వస్తారు. వీళ్లందరూ ఎన్నికల్లో మెజారిటీ జనాభిమానం పొందుతారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని లోపల నుంచీ బలహీనపరుస్తారు. 2000 సంవత్సరం తర్వాత అన్ని దేశాల్లో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగాయి. వీటితోపాటే అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తామనే జనాకర్షక నేతల ప్రాబల్యమూ పెరిగింది. భారత్ లాంటి దేశాల్లోనే కాదు... అమెరికాలో సైతం ప్రజాస్వామ్య క్షీణతపై ఆలోచనాపరుల్లో భయం పట్టుకుంది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను బహిరంగంగా తూలనాడటం, ఫలానా విధంగా తీర్పులు ఇవ్వాలని న్యాయస్థానాలను హెచ్చరించటం, చట్టసభలను ఖాతరు చేయకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం లాంటివి ప్రపంచ దేశాలన్నిటి మీదా ప్రభావం చూపుతున్నాయి. అన్నింటా అమెరికా వైపుచూసే వివిధ దేశాల్లోని పాలకులకు తాము ఆ దారిలో ఇంకా ఎక్కువ వేగంగా అడుగులు వేసేలా అవి ప్రేరణను ఇస్తున్నాయి.

ప్రజాస్వామ్యానికి అన్ని వైపుల నుంచి ఇలా సమస్యలు చుట్టుముడుతున్న నేపథ్యంలో దాని మనుగడపైనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఆర్థికశాస్త్రంలో రెండేళ్ల క్రితం నోబుల్ బహుమతి పొందిన డరాన్ అసెమోగ్లూ ఈ సమస్యలన్నిటినీ విశ్లేషిస్తూ 'ఉదారవాద ప్రజాస్వామ్యానికి ఏమైంది?' అంటూ తాజాగా ఒక సమగ్ర పుస్తకాన్ని ప్రచురించారు. ప్రజాస్వామ్యం నిలబడాలంటే ఏం చేయాలన్నదే ఆయనకు ప్రధానం కాబట్టి ఆ కోణంలోనే కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆధునిక రాజకీయాల్లో ప్రజాస్వామ్యాన్ని అత్యుత్తమ వ్యవస్థగా, జీవన విధానంగా భావించే వారికి ఆయన ప్రతిపాదనలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే దాన్ని మళ్లీ సాధారణ ప్రజల జీవితాలను మెరుగుపరచేలా చేయగలగాలి. దాన్నే ఆయన 'వర్కింగ్ క్లాస్ లిబరలిజం'గా వర్ణించారు. అమెరికా, పశ్చిమయూరపు దేశాల్లో రెండో ప్రపంచయుద్ధం ముగిసిన నాటి నుంచి దాదాపు 30 ఏళ్లు ప్రజల జీవనప్రమాణాలు విశేషంగా మెరుగుపడ్డాయి. ఆర్థికరంగాన్నీ, ప్రజల, కార్మికుల బాగోగులనూ మార్కెట్ శక్తులకే వదలివేయకుండా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. ప్రజల సామాజిక, ఆర్థిక సంక్షేమాన్ని పాలనకు ముఖ్య కర్తవ్యంగా భావించాయి. ఈ కారణంగానే ప్రజలు ఉదార ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని పెంచుకున్నారు. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ తమకు అండగా ఉంటుందని భావించారు. 1950ల తర్వాత పరిశ్రమలు పెరిగాయి. ఉద్యోగాలు పెరిగాయి. కార్మికుల జీతాలు పెరిగాయి. మధ్యతరగతి విస్తరించింది. ప్రభుత్వసేవలు మెరుగయ్యాయి. విద్య, ఆరోగ్య రంగాల్లో ఎంతో పురోగతి సాధ్యమైంది. ఆర్థికాభివృద్ధి ఫలితాలు అన్నివర్గాల ప్రజలకూ చేరటం వల్ల 'ఈ వ్యవస్థలో నాకూ స్థానం ఉంది' అన్న భావన ప్రజల్లో బలపడింది.

ఒకప్పుడు స్వేచ్ఛకూ, ప్రజాస్వామ్యానికీ, ఆర్థికాభివృద్ధికీ విజయవంతమైన నమూనాగా లిబరల్ డెమొక్రసీ కనపడింది. ఇప్పుడు దానికి గండిపడింది. ప్రజలతో ఆర్థిక, రాజకీయ సంబంధాన్ని క్రమంగా డెమొక్రసీ కోల్పోయింది. ఇది ఒక్కసారిగా జరగలేదు. 1980ల తర్వాత మొదలై 2000ల తర్వాత తీవ్రమైంది. 'మా ఉద్యోగాలు భద్రంగా లేవు. మా ఆదాయం పెద్దగా పెరగటం లేదు. మా పిల్లల భవిష్యత్తు మాకంటే మెరుగ్గా ఉంటుందన్న నమ్మకం కలగటం లేదు. రాజకీయ నాయకులు మా వినతులను వినటం లేదు. దేశం అభివృద్ధి అవుతోంది. కానీ ఆ ప్రయోజనం మాకు తగినంతగా దక్కటం లేదు' అన్న మాటలు సగటు మనుషుల నుంచి వినిపించటం ఇప్పుడు సాధారణమైంది. 'ప్రతి వ్యక్తికీ తనకు నచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఉంది'.. లిబరలిజం అంటే అంతకు మించి ఏముంటుంది? అని అనుకుంటే సంక్షోభం అర్థంకాదు. నచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఉండటం వల్ల జీవన ప్రమాణాలు వాటంతట అవే పెరగవు. స్వేచ్ఛను ఉపయోగించుకుని మెరుగైన జీవితాన్ని ఏర్పరచుకునే పరిస్థితులనూ, అవకాశాలనూ ప్రభుత్వాలు సృష్టించాలి. ఒకప్పుడు లక్షలాది కార్మికుల అవసరం ఉండేది. కార్మికులు కూడా సంఘటితంగా ఉండి డిమాండ్లు సాధించుకునేవారు. ఎక్కువ జీతాల కోసం పోరాడగలిగేవారు. వారికి రాజకీయ ప్రాధాన్యత ఉండేది. ఇప్పుడన్నీ పోయాయి. ఆటోమేషన్ పెరిగింది. ఫ్యాక్టరీలు కనుమరుగయ్యాయి. కార్మిక సంఘాలు బలహీనపడిపోయాయి. 1990ల తర్వాత (పోస్ట్ ఇండస్ట్రియల్) బాగా ఉన్నత చదువులు చదివిన వారికీ, టెక్నాలజీ నిపుణులకూ ప్రాధాన్యం పెరిగింది. ఉద్యోగాలన్నీ ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ రంగాలకు తరలిపోయాయి. సాధారణ చదువులు చదివినవారు వెనుకబడిపోయారు. వేతనాల్లోనూ విపరీత వ్యత్యాసాలు పెరిగాయి. సంప్రదాయ పరిశ్రమలు, రంగాలపై ఆధారపడినవాళ్లు స్థిరత్వాన్ని కోల్పోయారు. అందుకే కొద్ది ఉద్యోగాలను మాత్రమే కల్పించే విధానాలకు పెద్దపీట వేసిన నిపుణుల పట్ల వ్యతిరేకత ప్రబలింది. రాజకీయాల్లోనూ ఉన్నతవర్గాల ప్రాబల్యం పెరిగింది. వీరందరిపై మధ్య, కింది వర్గాల ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఉపయోగించుకుని ట్రంప్ లాంటి నేతలు అధికారంలోకి వచ్చారు. ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తున్న విధానాలపైనా, వాటి సృష్టికర్తపైనా పోరాడుతున్నామంటూ ఉద్రేక ప్రసంగాలు చేసి ఎన్నికల్లో గెలిచారు.

ఐటీ విప్లవం, ఆటోమేషన్ కలిగించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల నుంచి కృత్రిమమేధ (ఏఐ) కూడా ప్రజలను గట్టెక్కించలేదు. ఏఐని ఎవరికి ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తున్నారో పరిశీలిస్తే కానీ దాని ప్రభావం అర్థంకాదు. కార్మికులను తొలగించటం, నిరుద్యోగ భయాన్ని మరింత పెంచటం, వీటితో పాటు అసమానతలు మరింత హెచ్చేలా చేయటం... ఏఐ వల్ల జరిగితే సంక్షోభం యథాతథంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నమ్మకం మరింతగా సడలిపోతుంది. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ తమకు ఏమీ చేయటం లేదన్న భావనను మరింత ఎక్కువ చేస్తుంది. లిబరల్ డెమొక్రసీని కాపాడుకోవాలంటే అది మళ్లీ సాధారణ ప్రజల జీవితాల మెరుగుదలకు తోడ్పడాలి. గౌరవంగా జీవించగల ఉద్యోగాలను కల్పించాలి. ఏమీ చేయలేని అశక్తులుగా ఉద్యోగులను మార్చకూడదు. అభివృద్ధి ఫలాలు (షేర్డ్ ప్రాస్పరిటీ) విస్తృతంగా ప్రజలకు చేరాలి. విధాన నిర్ణయాల్లో కేంద్రీకరణకు స్వస్తిపలకాలి. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ప్రజలకు సామాజిక, ఆర్థిక, ఉద్యోగ భద్రతనూ, నిజమైన రాజకీయ భాగస్వామ్యాన్నీ అందిస్తేనే లిబరల్ డెమొక్రసీ భవిత పదిలంగా ఉంటుంది. అది చేయలేనప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు చూస్తారు. లిబరల్ డెమొక్రసీకి అప్పుడు అసలైన ప్రమాదం ముంచుకొస్తుంది.

## కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి..: సీఎం రేవంత్ సవాల్

మొదటి పేజీ తరువాయి

"బీఆర్ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు. మా ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 1.06 కోట్ల రేషన్‌కార్డులు ఇచ్చాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. బీఆర్ఎస్ కార్యకర్తలకూ వాటిని అందిస్తున్నాం. వారి ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా?మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు తీసుకోలేదా?పేదలకు సహాయం చేసినందుకు ఇందిరమ్మ పాలన పోవాలా?"

కేసీఆర్ సభకు రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి

"సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా సంస్కారం ఉంది. అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లిని బయటకు గెంటేశారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు.. ఆడబిడ్డను చూసుకోవాలి. మీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రండి.. చూసుకుందాం. రాసిపెట్టుకోండి.. మీకు భవిష్యత్ లేదు. మీ బతుకులు చీకటిమయమే. రేవంత్ ఉన్నంతకాలం.. బీఆర్ఎస్ అనే మొక్కను ఎదగనివ్వం. తెలంగాణ తులసి వనంలో గంజాయి మొక్కను పీకుతాం. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా. వచ్చేసారి సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలుస్తుంది. ఈనెలాఖరుకు సిరిసిల్ల వెళ్తాం. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తాం. బావ బావమరుదులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. వచ్చే ఎన్నికల నాటికి సీట్లు పెరిగితే 117, ప్రస్తుతం ఉన్నవే కొనసాగితే 90 స్థానాలతో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గజ్వేల్‌లోనే తేల్చుకుందాం" అని రేవంత్ సవాల్ విసిరారు.

## 2029లోగా ఏపీలో మరో మూడు డీఎస్సీలు: మంత్రి లోకేశ్

మొదటి పేజీ తరువాయి

విజయవాడ: డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో లోకేశ్ మాట్లాడారు. "కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి. 14 డీఎస్సీలు వేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు. మా ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. మా ప్రభుత్వంలో ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. 2029లోగా మరో మూడు డీఎస్సీలు వస్తాయి.పిల్లలను గొప్పవాళ్లుగా తయారు చేసే అద్భుతమైన అవకాశం టీచర్లకే ఉంది. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. టీచర్లను విదేశాలకు పంపిస్తున్నాం. అక్కడ స్టడీ చేసి రావాలని కోరుతున్నాం. ప్రాక్టికల్ విద్య అందిస్తేనే పిల్లలు అద్భుతాలు చేస్తారు. విద్యాశాఖలో ఏపీ మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలి. గత ప్రభుత్వం 117 జీవో తెచ్చి పిల్లలను పాఠశాలలకు దూరం చేసింది. నేటి కాలానికి అనుగుణంగా పాఠశాల సిలబస్ మారుస్తున్నాం" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

కరీంనగర్: కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని.. తెలంగాణ తెచ్చిన ఆయన రాజీనామా చేయాలా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని డా.బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. "నిరుద్యోగులను కాంగ్రెస్ నిండా ముంచింది. ఈ ప్రభుత్వ పాలనలో విజన్ కాకుండా విధ్వంసమే ఉంది. ఉద్యోగాలు అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నోటిఫికేషన్ గురించి అడిగితే లూటిఫికేషన్ చేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

## ప్రజలను ఇబ్బందిపెట్టేలా ఏపీ పేపర్‌మిల్లు వ్యవహరిస్తోంది: కందుల దుర్గేష్

మొదటి పేజీ తరువాయి

మే నెలలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేపర్ మిల్లు వ్యర్థ జలాలు కలిసే ప్రాంతాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి పరీక్షించి ఏ స్థాయిలో జల కాలుష్యం జరుగుతుందో బహిర్గతం చేశారన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడే పేపర్‌మిల్లు తరహా పరిశ్రమల తీరును ఎండగడతామన్నారు. పన్నులు చెల్లించకుండా న్యాయవివాదాలతో కాలయాపన చేస్తున్నారని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడంలో దారుణంగా విఫలమయ్యారని మండిపడ్డారు. అలానే కడియంలోని పేపర్‌మిల్లు 70 మంది కార్మికులను రోడ్డున పడేసిందని దుయ్యబట్టారు.

## మోదీ తెలివైన వారు.. ఆయన చెప్పినట్లు చేయాలి: బెల్జియం ప్రధాని

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్ ప్రశంసలు కురిపించారు. అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రపంచ నేతల్లో ఆయన ఒకరని ప్రశంసించారు. మోదీ చాలా తెలివైన వారని.. అస్థిరమైన ప్రపంచ పరిస్థితుల మధ్య ఆయన అనుసరిస్తున్న విధానం ప్రత్యేకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఏదైనా బాగా ఆలోచించే చెప్తారని.. ఆయన చెప్పినట్లు చేయాలన్నారు.

"గతంలో భారత పర్యటనకు రావాలనుకున్న సమయంలో కొవిడ్ ప్రబలడంతో పర్యటన రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఇక్కడికి చేరుకోవడం ఆనందంగా ఉంది. మోదీని కలవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఆయన్ను అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రపంచ నాయకుల్లో ఒకరిగా భావిస్తా. చాలా మంది ప్రపంచ నేతల మాటలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతుంది. కానీ.. మోదీ మాట్లాడితే ఆయన చెప్పినట్లు చేయాలనిపిస్తుంది. చాలా స్ఫూర్తి పొందొచ్చు. ఆయన పాలనలో భారత్ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది' అని బెల్జియం ప్రధాని పేర్కొన్నారు.

ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ పాత్ర..

ప్రపంచ వేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందని బార్ట్ డె వెవర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా.. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను అభివర్ణించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి సమయంలో బ్రస్సెల్స్ ఇప్పుడు భారత్‌ను ఒక కీలక, విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందన్నారు. ఆ దేశంతో బంధాలను ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ మరో స్థాయికి తీసుకెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## పికాక్స్ పర్వతంపై త్వరలో భారీ దాడులు: ట్రంప్ మరో వార్నింగ్

మొదటి పేజీ తరువాయి

టెహ్రాన్ చేతికి అణ్వాయుధం దక్కకుండా చూడటమే తమ ప్రధాన ఉద్దేశమని ఓవల్ ఆఫీసులో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై సైనిక చర్య ప్రారంభించి ఐదు నెలలు అయ్యిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ ఐదు నెలల్లో ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకోగలిగి తాము విజయం సాధించినట్లు తెలిపారు.ఇరాన్‌లోని కుహ్-ఎ కోలాంగ్ గాజ్ లా పర్వతాన్ని స్థానికంగా పికాక్స్ పర్వతం అని పిలుస్తారు. ఇది జాగ్రాస్ పర్వత శ్రేణిలో.. నతాంజ్ అణు కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరాన్ తన అణు కార్యక్రమానికి అవసరమైన సెంట్రిఫ్యూజ్‌లను ఇక్కడికి తరలించి ఉండొచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు గతంలో అంచనా వేశాయి. ఈ కేంద్రంలో ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే దానిపై మాత్రం స్పష్టత లేదు.కాగా.. ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ సార్వభౌమత్వాన్ని అమెరికా ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. తమపై దాడులకు ప్రతిగా పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు వెల్లడించింది. ఒకవేళ, ట్రంప్ హెచ్చరించినట్లు పికాక్స్ పర్వతంపై అమెరికా దాడి చేస్తే.. పశ్చిమాసియాలో ఘర్షణలు మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది.

## సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

విజయవాడ: సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులంతా ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లేనని చెప్పారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు."1991 నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పోటీతో పాటు అవకాశాలు పెరిగాయి. టెక్నాలజీతో మంచి చెడు రెండూ ఉన్నాయి. నేటి కాలంలో బోధనా విధానం పూర్తిగా మారింది. మా చిన్నప్పుడు టీచర్లు బాగా కొట్టేవారు. భయభక్తులతో చదువుకునే వాళ్లం. టీచర్‌తో దెబ్బలు తిన్నవారంతా బాగుపడతారు. పిల్లల మానసిక స్థితి మారుతోంది.. టీచర్లు గమనించాలి. మారుతున్న సాంకేతికత పిల్లలపై పెను ప్రభావం చూపిస్తోంది. సామాజిక మాధ్యమాలు పిల్లలకు శాపంగా మారాయి. పిల్లల్లో కుటుంబ విలువలు, నైతిక ప్రవర్తన పెంపుపై టీచర్లు దృష్టి పెట్టాలి.

### టీచర్లు గౌరవంగా జీవించాలి

అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచుతున్నాం. బడి పరిసరాలు పచ్చగా ఉండాలి.. అప్పుడే పిల్లలకు మంచి ఆలోచనలు వస్తాయి. బడిలో పచ్చదనం పెరిగేలా టీచర్లు చర్యలు తీసుకోవాలి. తెదేపా అధికారంలో ఉండగా 14 డీఎస్సీలు చేపట్టాం. టీచర్లు గౌరవంగా జీవించాలి.. రాజకీయ నేతల చుట్టూ తిరగకూడదు. ప్రతిభావంతులైన టీచర్లను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం. టెలికామ్, ఐటీ గురించి ముందే ఊహించా.. ఈ విషయం అప్పటి ప్రధానికి చెప్పా. ఆనాడు మేం వేసిన పునాది వల్లే హైదరాబాద్ రూపురేఖలు మారాయి. ఇప్పుడు ఏ దేశానికి వెళ్లినా మన తెలుగువాళ్లు కనిపిస్తారు. విదేశాల్లో ఎక్కువ సంపాదించేది కూడా తెలుగువాళ్లే. టెక్నాలజీని వాడుకుంటేనే అందరికంటే ముందుకెళ్లగలం. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు, డ్రోన్లు, రోబోటిక్స్ వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు.

# హామీలు అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి పోస్టు ఊడక తప్పదు: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి,సెప్టెంబర్ 05,మన మహతి న్యూస్ :**









కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చింత ప్రభాకర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డిలో విద్యార్థి--యువజన నిరసన ర్యాలీ నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, విద్యార్థులతో కలిసి పూలమాల వేశారు.ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిని నెరవేర్చలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, జాబ్ క్యాలెండర్ అమలు కాక నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారని అన్నారు.యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన మండిపడ్డారు. అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి, ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోవాలని చింత ప్రభాకర్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేసే ప్రయత్నాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. యువతను తక్కువ అంచనా వేయొద్దని, తమ హక్కుల కోసం విద్యార్థులు, యువత ఉద్యమాలు కొనసాగిస్తారని అన్నారు."హామీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి, యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలి. లేకపోతే ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం" అని చింత ప్రభాకర్ హెచ్చరించారు.యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చంద్ర గౌడ్, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, హకీం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, మనోహర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు, శ్రవణ్ రెడ్డి, వాజిత్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## గణపారపు అనితకు కాంగ్రెస్ నాయకుల నివాళి



ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డుకు చెందిన గణపారపు నాగయ్య కుమార్తె గణపారపు అనిత (22) అనారోగ్యంతో మృతి చెందారు. సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఆమె శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. అనిత మృతిచెందిన విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్, ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు వెంపటి సురేష్, గణపారపు వీరయ్యలు శనివారం ఆమె స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కినేపల్లి దేవయ్య చారి, మేళ్లచెరువు సురేష్, ఏపూరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం...

మన మహతి న్యూస్ ప్రతినిధి



నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.విద్యార్థుల భవిష్యత్ గురువుల చేతుల్లోనే... విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని న్యూ శాంతినికేతన్ ప్రిన్సిపల్ భీశీ రెడ్డి అన్నారు.మండల పరిధిలోని జక్లేర్ న్యూ శాంతినికేతన్ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ భీశీరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రిన్సిపల్ భీశీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దరంలో సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు.అనంతరం తెలుగు ఉపన్యాసకులు మహేష్ గౌడ్ మాట్లాడుతూ టీచర్లలో బెస్ట్ అని ఆర్డినరీ అంటూ ఉండదని తన దృష్టిలో అందరూ బెస్ట్ టీచర్లేనన్నారు. విద్యతోనే విద్యార్థుల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునిలు ప్రభావతి,అరుణ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

మన మహతి న్యూస్ ప్రతినిధి




నారాయణపేట జిల్లా.మాగనూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించి మాగనూరు మండల బీజేవైఎం అధ్యక్షులు అశోక్ కుమార్ మాట్లాడుతూఈ రోజు మనందరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు ఉపాధ్యాయ దినోత్సవం.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.ఒక విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే.ఉపాధ్యాయులు మనకు కేవలం పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే నేర్పరు. జీవితంలో ఎలా ముందుకు సాగాలి, మంచి మనిషిగా ఎలా ఉండాలి, కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, సమాజానికి ఎలా ఉపయోగపడాలి అనే విషయాలను కూడా నేర్పుతారు. మనలో ఉన్న ప్రతిభను గుర్తించి, మనకు సరైన మార్గాన్ని చూపించి, మన భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులే.ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది విద్యార్థుల జీవితాలను మార్చగలడు.విద్యార్థి సాధించిన ప్రతి విజయానికి, అతని వెనుక ఒక ఉపాధ్యాయుడి కృషి, ప్రోత్సాహం, ఆశీర్వాదం తప్పకుండా ఉంటుంది.ఈ సందర్భంగా మనకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.గురువు అంటే కేవలం ఒక వృత్తి కాదు... అది ఒక బాధ్యత.గురువు అంటే కేవలం ఒక వ్యక్తి కాదు... అది ఒక మార్గదర్శక శక్తి.మన జీవితాలను తీర్చిదిద్దుతున్న గురువులందరికీ ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు . ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప, మరియు సీనియర్ నాయకులు సోమప్ప గౌడ, అంజప్ప గౌడ, లోకపల్లి హనుమంతు, కాలప్ప,డాక్టర్ కృషశివప్ప మల్లప్ప గౌడ, బంగి శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పి ఈ టి బి గోపాలం ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం.

మన మహతి న్యూస్ ప్రతినిధి



నారాయణపేట జిల్లా మక్తల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బి.గోపాలం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ శ్రీ సత్యసాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులను శాలువాతో, మెమొంటో అందజేసి ఘన సన్మానించి, అభినందించారు. అధ్యక్ష కార్యదర్శులు బి.గోపాలం, బి భాస్కర్ మాట్లాడుతూ రిటైర్మెంట్ అయినా ఉపాధ్యాయులను మక్తల్ వాసవి వనిత క్లబ్ సభ్యుల ద్వారా గౌరవించి, సన్మానించి, ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేస్తున్నామని వారు తెలిపారు. సన్మానం పొందిన 60 మంది విశ్రాంత ఉపాధ్యాయులు:- అధ్యక్ష కార్యదర్శులు బి.గోపాలం, బి. భాస్కర్,అన్నదాతలు సిద్ధి లింగయ్య హేమలత,సంజన, సూర్య ప్రకాష్, జనార్ధన్ ,కిష్టయ్య గౌడ్, అరుణ, సుజాత, నర్సమ్మ ,విద్యావతి, సత్యనారాయణ, ఎల్లప్ప, నారాయణ రెడ్డి, రాములు, గోపాల్, జగదీష్, , భాస్కర్ రెడ్డి, తులసప్ప, నరసయ్య నాగిరెడ్డి ,లక్ష్మి కాంత్ రెడ్డి, 60 మంది రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు బి. గోపాలం వాసవి వనిత క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గురుపూజోత్సవంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువులకు ఘన సన్మానం







**• శ్రీ వివేకానంద గురుకుల విద్యాలయం జంగేడు భూపాలపల్లి 1994--95 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు**

**హనుమకొండ జిల్లా సెప్టెంబర్ 5 న్యూస్**

శ్రీ వివేకానంద గురుకుల విద్యాలయం జంగల్ భూపాల్ పల్లి జిల్లా 1994 95 బ్యాచ్ విద్యార్థిని విద్యార్థులు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, బొకేలు, పూలదండలతో ఘనంగా సన్మానించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో గురువులు దుగ్యాల నర్సింగరావు, సంజీవరావు, సంతోష్‌రెడ్డి, సంజీవరావు, ఎం.ఎం.చారి, సుధాకర్, ఐలయ్య, పోచయ్య, వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌రావు, రాజమౌళి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. గురువులను సన్మానించిన విద్యార్థిని విద్యార్థులు లావుడియా రాజునాయక్, సిహెచ్ రాజేందర్‌రెడ్డి, జి రఘుపతి, గోపీకృష్ణ, రాజయ్య, అనిల్, శరత్, రవి, రమేష్, శ్రీనివాస్, ఐలయ్య, సత్యం, వెంకటరమణ, రాజేశ్వరరావు, సుమన్, మాధవరావు, తిరుపతి, వేణు, రమేష్, రవీందర్, భాస్కర్‌రావు, రామ్‌రెడ్డి, శివకుమార్, జగన్, మాధవ్, అరుణ్‌కుమార్, రవికుమార్, గణేష్, కమలాకర్, సంతోష్, సుల్తాన్, నవీన్, సమ్మయ్య, మహేందర్, తిరుపతి, శంకర్, కర్ణాకర్, సుధాకర్, విజేందర్‌రెడ్డి, రాజు తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.మహిళా పూర్వ విద్యార్థినుల్లో సునీత, రజియా, సునీత, మాధవి, భాగ్యలక్ష్మి, శ్రీలత, సుజాత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి గురువులు అందించిన విద్య, క్రమశిక్షణ, మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. గురువులను సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.గురుపూజోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించి, గురువుల ఆశీర్వాదాలు పొందారు

# సంగారెడ్డి బైపాస్ అభివృద్ధికి రూ.18 కోట్లు

**• 30 ఏళ్ల క్రితమే ఈ రోడ్డుకు బీటీ వేశాం: జగ్గారెడ్డి**

**సంగారెడ్డి,సెప్టెంబర్ 05,మన మహతి న్యూస్ :**





సంగారెడ్డి పట్టణ బైపాస్ రోడ్డు విస్తరణకు రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ నేత తూర్పు జగ్గారెడ్డి తెలిపారు. పట్టణ అభివృద్ధిపై కొందరు చేస్తున్న విమర్శలకు ఆయన స్పందించారు.1995లో సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి తానే చొరవ తీసుకున్నానని జగ్గారెడ్డి చెప్పారు. అప్పట్లో మున్సిపాలిటీకి వచ్చిన రూ.కోటి గ్రాంటులో రూ.80 లక్షలను బైపాస్ రోడ్డు బీటీ, ఫార్మేషన్ పనులకు వినియోగించినట్లు తెలిపారు. ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు ఉన్న రహదారి అప్పట్లో అధ్వానంగా ఉండేదని, వర్షాకాలంలో వాహనదారులు ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు.ఆ సమయంలో నిర్మించిన రహదారి కారణంగా బైపాస్ పరిసర ప్రాంతాల్లో కాలనీలు అభివృద్ధి చెందాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు. దాదాపు 30 ఏళ్లపాటు ఆ రోడ్డు ప్రజలకు ఉపయోగపడిందన్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి బైపాస్ రోడ్డు విస్తరణకు రూ.18 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. రోడ్డు విస్తరణలో చెట్లు, విద్యుత్ లైన్లు, వ్యాపార సంస్థలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాల్సి ఉండటంతో కొంత జాప్యం జరుగుతోందన్నారు. రోడ్డు పనుల నాణ్యతపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన అంశంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

### సదాశివపేట అభివృద్ధి పనుల ప్రస్తావన

సదాశివపేటలో కందకం రోడ్డు నిర్మాణాన్ని తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టినట్లు జగ్గారెడ్డి చెప్పారు. అలాగే సిద్ధాపూర్‌లో సుమారు 5 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంతో పాటు పొజిషన్లు కూడా కల్పించినట్లు పేర్కొన్నారు.అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ స్థలాల విషయంలో సమస్యలు ఏర్పడ్డాయని ఆరోపించారు. సిద్ధాపూర్‌లో సుమారు 100 ఎకరాలను వివిధ శాఖలకు కేటాయించినట్లు పేర్కొంటూ అప్పటి మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేశారు.సంగారెడ్డి తన సొంత ప్రాంతమని, అందుకే పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నానని జగ్గారెడ్డి అన్నారు. అభివృద్ధి పనులపై రాజకీయ విమర్శలు చేయడం కంటే పనులు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్నవి కావని, సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసమే చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

## సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, న్యూస్‌టుడే: అన్ని పార్టీల నుంచి నాయకులను చేర్చుకొని నానాజాతి సమితిగా మారిన భారాస.. మా పార్టీని పచ్చ కాంగ్రెస్ అనడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెదేపా నుంచి వచ్చిన నాయకులతో భారాస నిండిపోయినప్పుడు.. ఆ పార్టీని కూడా పచ్చ పార్టీ అనాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ రాజకీయ ప్రస్థానం ఎక్కడ ప్రారంభమైందో కేటీఆర్ గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వ లేక భారాస, భాజపాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. వ్యక్తిగత దూషణలు, కించపరిచే పోస్టర్లను సహించేంది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదల కడుపు నింపే విధంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఎన్నిక హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భారాస హయాంలో పేదలకు లక్ష ఇళ్లు ఇవ్వలేకపోయారని, ప్రజా ప్రభుత్వంలో తొలి దశలోనే 4.5 లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవియాదవ్, నాయకులు ముసినిపెల్లి కుమార్‌గౌడ్, జక్కుల రేవంత్, పల్లె జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలి

- **వరంగల్ జిల్లా సర్పంచులందరికీ తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గుగులోత్ వినోద రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో ఈ అధికారిక పిలుపు ఇవ్వడం జరుగుచున్నది.**

వరంగల్ జిల్లా సెప్టెంబర్ 5 న్యూస్

సర్పంచుల హక్కులు, అధికారాలు మరియు స్థానిక పరిపాలనకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై, ఉపసర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలనే



ప్రధాన డిమాండ్‌తో జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించనున్నాము.

09-09-2026, బుధవారం సమయం: ఉదయం 11:00 గంటలక వేదిక: జిల్లా కలెక్టర్ కార్యాలయం, వరంగల్ తప్పనిసరి హాజరు సూచన

వరంగల్ జిల్లా పరిధిలోని ప్రతి సర్పంచ్ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరడమైనది. ఇది మన సర్పంచులందరి సామూహిక సమస్య మరియు హక్కులకు సంబంధించిన అంశం కావున, ప్రతి సర్పంచ్ వ్యక్తిగత బాధ్యతగా భావించి సమయానికి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడమైనది. ఎటువంటి మినహాయింపులు లేకుండా సర్పంచులందరూ పెద్ద సంఖ్యలో హాజరై మన ఐక్యతను, మన సమస్యపై మన బలమైన వైఖరిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నాము. సర్పంచుల ఐక్యతే మన బలం --- ఐక్యంగా సాధించే నిర్ణయమే మన విజయం.

గుగులోత్ వినోద్ రవీందర్ నాయక్ అధ్యక్షులు వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం
98582 30006, 98493 8338
వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం

# గీతంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.. గురువులకు ఘన సత్కారం













సంగారెడ్డి, సెప్టెంబర్ 05,మన మహతి న్యూస్ :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం--2026ను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రను గుర్తిస్తూ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను యాజమాన్యం శాలువాలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాలతో సత్కరించింది. యువతకు జ్ఞానం, మార్గదర్శకత్వం, స్ఫూర్తిని అందిస్తున్న అధ్యాపకుల సేవలను నిర్వాహకులు కొనియాడారు.

# గురువే జ్ఞానానికి వెలుగు.. భవిష్యత్తుకు బాట

- **ఉపాధ్యాయుడు చెప్పే ఒక మంచి మాట విద్యార్థి జీవితాన్నే మార్చగలదు: ఐటీడీఏ పీవో బి. రాహుల్**

మన మహతి న్యూస్ భద్రాచలం

ఒక మంచి ఉపాధ్యాయుడు పాఠాలతో పాటు జీవితాన్ని కూడా బోధిస్తాడని, తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు రూపం ఇస్తారని భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ అన్నారు. గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిరిజన భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. గిరిజన ప్రాంతాల్లో సవాళ్లను ఎదుర్కొంటూ ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి



జీవితాన్ని తీర్చిదిద్దితే ఒక కుటుంబం, వంద మందిని తీర్చిదిద్దితే సమాజం, వేలాది మందిని తీర్చిదిద్దితే దేశ భవిష్యత్తు మారుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం మాత్రమే కాకుండా బాధ్యత, సేవ, పవిత్రమైన యజ్ఞమని అన్నారు. గిరిజన విద్య బలోపేతానికి ఉద్దీపకం-1, 2, 3, వారధి పుస్తకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రాథమిక విద్యను పటిష్టం చేయడంతో పాటు వారానికి మూడు రోజులు ఇంగ్లిష్, గణితంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా బోధించాలని సూచించారు. పదో తరగతి ఫలితాలు, క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయమన్నారు. పాఠశాలల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపడతామని తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, మానవత్వం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఉద్దీపకం-3, వారధి రూపకల్పనలో సహకరించిన ఆర్పీలు, క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన పీడీలు, పీఈటీలను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఆర్‌సీఓ గురుకులం అరుణకుమారి, ఏసీఎంవోలు రమేష్, రాములు, ఏటీడీఓలు చంద్రమోహన్, రాధమ్మ, , భారతీదేవి, పీఐటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, జీసీడీవో అలివేలు మంగతాయారు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండప నిర్వాహకులకు కీసర పోలీసుల అవగాహన





- **గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి**
- **విద్యుత్ భద్రత, లౌడ్‌స్పీకర్లు, ట్రాఫిక్, నిమజ్జనంపై నిర్వాహకులకు అవగాహన**

మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండల్ సెప్టెంబర్ 05

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు, గ్రామ ప్రజలు, కాలనీ అసోసియేషన్ సభ్యులకు కీసర పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం కీసర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏసీపీ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటు, మండపాల నిర్వహణ, విద్యుత్ భద్రత, లౌడ్‌స్పీకర్ల వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై నిర్వాహకులకు అధికారులు అవగాహన కల్పించారు. సంబంధిత అనుమతులు పొందడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలు, పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి గొడవలు, వివాదాలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, భక్తులు పరస్పరం సహకరించుకోవాలని పోలీసులు కోరారు. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

"శాంతియుత గణేష్ ఉత్సవాలు -- అందరి బాధ్యత" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కీసర పోలీసులు కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది,



గ్రామ ప్రజలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

**గాయపడిన కానిస్టేబుల్ రామచంద్రం**

తొర్రూరు, న్యూస్‌టుడే: దంపతుల మధ్య గొడవతో డయల్ 112 వచ్చిన కాల్‌కు స్పందించి ఘటనాస్థలికి వెళ్లిన కానిస్టేబుల్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచిన ఘటన తొర్రూరులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ కేంద్రంలోని సన్నూరుడొంక రోడ్డులో నివసిస్తున్న కోటేశ్వరరావు - చంద్రకళ దంపతుల గొడవతో చంద్రకళ 122కు డయల్ చేసింది. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ రామచంద్రం అక్కడకు వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న చంద్రకళ భర్త కోటేశ్వరరావు కత్తితో రామచంద్రంపై దాడిచేసి గాయపరిచాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై మహేందర్‌రెడ్డి వెళ్లి గాయపడిన రామచంద్రంను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ రామచంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటేశ్వరరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మన మహతి న్యూస్ పాల్వంచ



పాల్వంచ మండలం కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. చందు మాట్లాడుతూ.. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యారంగానికి ఆయన అందించిన సేవలు దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, నైతికతను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవిస్తూ, వారి సూచనలు పాటించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం టీచర్స్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు

## శ్రీ చైతన్య పాఠశాల కొత్తగూడెం-1లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మన మహతి న్యూస్ కొత్తగూడెం

శ్రీ చైతన్య పాఠశాల కొత్తగూడెం-1లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కల్యాణి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, నైతికతను నేర్పుతూ మంచి భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తారని అన్నారు. హైస్కూల్ కోఆర్డినేటర్ చెంచల బాబు మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థి గురువులను గౌరవించి వారి సూచనలు పాటించాలని తెలిపారు. ప్రైమరీ కోఆర్డినేటర్ మాధవి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది



వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రేమ, సహనంతో వారిలో మంచి ఆలోచనలు, అలవాట్లు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకున్నారు.

## కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఆయన పోరాటం చారిత్రాత్మకం**

మన మహతి న్యూస్ కొత్తగూడెం




కొత్తగూడెం: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మాజీ ప్రధాన కార్యదర్శి, పెన్షన్ పితామహుడు కామ్రేడ్ మనుబోతుల కొమురయ్య 30వ వర్ధంతిని పురస్కరించుకుని వీకేసీఎం ఓసీ గనిలో ఎస్సీసీడబ్ల్యూ/ఏఐటీయూసీ పిట్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆఫీస్ బేరర్ హీరాలాల్ మాట్లాడుతూ కొమురయ్య నాయకత్వంలో జరిగిన కార్మిక పోరాటాలు సింగరేణి కార్మికుల జీవితాల్లో చారిత్రాత్మక మార్పులకు నాంది పలికాయని అన్నారు. వేతన పెంపుదలలు, వార్షిక ఇంక్రిమెంట్లు, అలవెన్సులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి హక్కుల సాధనకు ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. 1వ నుంచి 6వ వేజ్ బోర్డు వరకు కార్మికుల తరఫున బలమైన ప్రతినిధిత్వం వహించడంతో పాటు జేబీసీసీఐ వేదికగా ఎల్టీసీ, క్యాడర్ స్కీమ్, పదోన్నతులు, పెన్షన్ వంటి హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణతో పాటు మహిళలు, పిల్లలను భూగర్భ గనుల పనుల నుంచి తప్పించి సురక్షిత పనుల్లో నియమించేందుకు చేసిన పోరాటాలు కార్మిక సంక్షేమ చరిత్రలో కీలక ఘట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీకేసీఎం పిట్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో 14 ఏళ్ల బాలిక మృతి

నల్లబెల్లి: విద్యుత్ షాక్‌కు గురై 14 ఏళ్ల బాలిక మృతి చెందిన విషాద ఘటన నల్లబెల్లి మండల కేంద్రం లో శుక్రవారం చోటుచేసుకుంది. నల్లబెల్లికి చెందిన పిట్టల సిరివెన్నెల (14) విద్యుత్ షాక్‌కు గురైంది. బాలికను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో ఈఎంటీ దస్రు, పైలట్ కిరణ్ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. బాలికలో ప్రాణ స్పందనలు లేకపోవడంతో సీపీఆర్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్న వయసులోనే బాలిక మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో నల్లబెల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు దరఖాస్తులు వచ్చాయి: కేంద్రం క్లారిటీ

కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు ఆదరణ లభించలేదంటూ వచ్చిన వార్తల్ని కేంద్రం ఖండించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాలేదన్న వాదనను తోసిపుచ్చింది. అవన్నీ అవాస్తవాలని, ఇలాంటి అసత్యాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపబోవని బొగ్గు గనుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఒఖీు), ఎన్‌టీపీసీ నుంచి ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయని బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కంపెనీల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్న వాదనను తోసిపుచ్చిన కేంద్రం.. తొలి రౌండ్ అప్లికేషన్ విండో ప్రక్రియ సెప్టెంబర్ 7న ముగుస్తుందని స్పష్టం చేసింది. ఈ స్కీమ్‌లో భాగంగా దాదాపు 25 ప్రాజెక్టులకు గానూ.. రూ.2.5- 3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తోంది. తద్వారా 50 వేల ఉద్యోగాలు సృష్టించొచ్చని భావిస్తోంది. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.



భారత్ ఇంధన అవసరాలకు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు 'బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్)' ప్రక్రియకు కేంద్రం సంకల్పించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి మే నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే.

# కలిసొచ్చిన ఏఐ రంగం..

## 15 ట్రిలియన్ డాలర్లకు చేరిన కుబేరుల సంపద

కృత్రిమ మేధ కారణంగా ఒకవైపు చాలామంది ఉద్యోగాలు కోల్పోతుంటే.. మరోవైపు పెద్ద పెద్ద కంపెనీలు భారీగా సంపద సృష్టిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు కలసిరావడంతో ప్రపంచవ్యాప్తంగా సంపన్నుల జనాభా పెరుగుతోంది. గతేడాది బిలియనీర్ల సంఖ్య దాదాపు 3800కు చేరినట్లు గ్లోబల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అల్ట్రాటా తన వెల్త్ రిపోర్ట్‌లో వెల్లడించింది. వీరి మొత్తం సంపద సుమారు 15.1 ట్రిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం.. రూ.1,417.37 లక్షల కోట్లు) చేరుకున్నట్లు తెలిపింది.

గత 5 ఏళ్లలో ఏఐ రంగంలో సగటున 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.283.25 కోట్లు) వరకు పెట్టుబడులు చేసిన కంపెనీలు అధిక మార్కెట్ విలువను సాధించాయని అల్ట్రాటా తన నివేదికలో పేర్కొంది. దీంతో బిలియనీర్ల సంపద 12.8 శాతం పెరగ్గా.. కుబేరుల సంఖ్య 8.2 శాతం ఎగబాకింది. ఏఐ రంగానికి సంబంధించిన టెక్నాలజీ స్టాక్స్‌లో పెట్టుబడులు భారీ సంపద సృష్టించాయని నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుబేరుల మొత్తం సంపదలో.. 27శాతం కేవలం 29 మంది సూపర్ బిలియనీర్ల (50 బిలియన్ డాలర్లను మించి ఆదాయం ఉన్న వారిని ఇలా పరిగణిస్తారు) వద్దే ఉన్నట్లు పేర్కొంది. అత్యధికంగా 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా మొదటి



స్థానంలో నిలవగా, 1,081 మందితో ఐరోపా రెండో స్థానంలో ఉంది. ఆసియాలో 881 మంది బిలియనీర్లు ఉన్నారు. మొత్తం సంపన్నుల్లో మహిళలు కేవలం 13 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

# జాగ్వార్ ల్యాండ్ రోవర్ కంపెనీలో 4వేల ఉద్యోగాలు కోత!

టాటా మోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జీూ=) భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో దాదాపు 4 వేల ఉద్యోగాలకు కోత విధించనున్నట్లు 'ది టైమ్స్' కథనం పేర్కొంది. అమెరికా టారిఫ్‌లు, వాహన తయారీ ఖర్చులు పెరగడం, విక్రయాలు తగ్గడమే ఇందుకు కారణమని తెలిపింది.

మరోవైపు, ఉద్యోగాల కోతకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి సమాచారం అందజేశామని, త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వెలువడనున్నట్లు కంపెనీ పేర్కొన్నట్లు సదరు వార్తా కథనం తెలిపింది. ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేతన సిబ్బంది, మేనేజ్‌మెంట్ టీమ్‌లపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా, బ్రిటన్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థల్లో ఒకటైన జేఎల్‌ఆర్ సంస్థ.. బ్రిటన్‌లో సుమారు 34 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ వ్యయం, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ ఆంక్షల ఒత్తిళ్లను తట్టుకొనేందుకే కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.



ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం వరకు తగ్గడం గమనార్హం. మరోవైపు, జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ కూడా లక్ష ఉద్యోగాలకు కోత విధిస్తున్నట్లుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

# జీవితకాల గరిష్ఠానికి ఫారెక్స్ నిల్వలు



ముంబయి: మన దేశ విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరాయి. ఆగస్టు 28తో ముగిసిన వారానికి 11.475 బిలియన్ డాలర్లు పెరిగి 740.803 బి.డాలర్లకు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం గణాంకాలు వెల్లడించింది. అంత క్రితం వారం కూడా నిల్వలు 12.422 బి.డాలర్ల మేర పెరిగి 729.328 బి.డాలర్లకు పెరిగాయి. గతంలో ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో 728.94 బి.డాలర్ల వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరగా, తాజాగా ఆ రికార్డును అధిగమించాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం..

ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఆగస్టు 28తో ముగిసిన వారంలో 9.337 బి.డాలర్ల మేర పెరిగి 600.67 బి.డాలర్లకు చేరాయి.

పసిడి నిల్వలు 2.191 బి.డాలర్ల మేర పెరిగి 116.409 బి.డాలర్ల(సుమారు రూ.11 లక్షల కోట్లు)కు చేరాయి.

మన దేశ ప్రత్యేక ఉపసంహరణ హక్కులు (ఎస్‌డీఆర్‌లు) మాత్రం 43 మి.డాలర్ల మేర తగ్గి 18.81 బి.డాలర్లకు పరిమితమయ్యాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వద్ద మన దేశ నిల్వల స్థితి కూడా 11 మి.డాలర్ల మేర తగ్గి 4.914 బి.డాలర్లకు పరిమితమైంది.

# ఎన్‌ఎస్‌ఈ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబరు 15 విడుదల!



**పదేళ్ల నిరీక్షణ అనంతరం సెబీ నుంచి అనుమతులు**

**దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచే అవకాశం**

**వచ్చే వారం ధరల శ్రేణిపై ప్రకటన**

మార్కెట్ వర్గాలు చాన్నాళ్లుగా ఆతృతతో ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) పబ్లిక్ ఇష్యూకు సెబీ ఆమోదముద్ర వేసింది. ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండొచ్చని చెబుతున్నారు. ఇప్పటివరకు చూస్తే దేశ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా ఇది నిలిచే అవకాశం ఉంది. సెప్టెంబరు 15న ఎన్‌ఎస్‌ఈ ఐపీఓ ప్రారంభం కావచ్చని ఈ పరిణామాలను దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబరు 24 లేదా 25న స్టాక్ ఎక్స్ఛేంజీలో షేర్లు నమోదవుతాయని అంటున్నారు. ఐపీఓలో భాగంగా విక్రయించే షేర్లకు ధరల శ్రేణి, ఇతరత్రా కీలక వివరాలను వచ్చే వారంలో (11న) ఎన్‌ఎస్‌ఈ ప్రకటించే అవకాశం ఉంది.

దశాబ్ద కాలంగా ఎదురుచూపులు..

కోలొకేషన్ వివాదంతో నియంత్రణపరమైన అడ్డంకుల వల్ల దాదాపు దశాబ్దకాలంగా ఈ ఐపీఓ జాప్యం అవుతూ వచ్చింది.

తొలుత రూ.10,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో 2016లో ఎన్‌ఎస్‌ఈని లిస్టింగ్ చేయాలని భావించారు. అయితే పాలనాపరమైన వైఫల్యాలు, కోలొకేషన్ కేసు దృష్ట్యా ఐపీఓకి తప్పనిసరి అయిన నో- అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ)ను ఇవ్వడానికి సెబీ నిరాకరించింది.

అప్పటి నుంచి కేసుల పరిష్కారానికి చర్యలు చేపడుతూనే.. 2019, 2020, 2024లో సెబీ నుంచి ఎన్‌ఓసీ పొందేందుకు ఎన్‌ఎస్‌ఈ ప్రయత్నించింది.

ఎట్టకేలకు ఈ ఏడాది ప్రారంభంలో కో-లొకేషన్, డార్క్ ఫైబర్ కేసుల వ్యవహారాలను సెబీతో ఎన్‌ఎస్‌ఈ పరిష్కరించుకొని ఎన్‌ఓసీ పొందడంతో ఒక కీలక అడుగు పడినట్లయ్యింది.

ఈ ఏడాది జూన్ 17న ఎన్‌ఎస్‌ఈ తన ఐపీఓ ముసాయిదా పత్రాలను సెబీ వద్ద దాఖలు చేయగా.. సెప్టెంబరు 4న తుది అనుమతులు లభించాయి.

పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే..

ఎన్‌ఎస్‌ఈ సమర్పించిన ఐపీఓ ముసాయిదా పత్రాల ప్రకారం...ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉంటుంది. తాజా షేర్లను జారీ చేయడం లేదు. ప్రతిపాదిత ఐపీఓ ప్రక్రియలో ప్రస్తుత వాటాదార్లు సుమారు 6% వాటాకు సమానమైన 14.89 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.

**ఇప్పటివరకు దేశంలో అతిపెద్ద ఐపీఓలు ఇలా..**

| కంపెనీ | సంవత్సరం | సమీకరణ(రూ.కోట్లలో) |
|---|---|---|
| హ్యుందాయ్ మోటార్ ఇండియా | 2024 | 27,858.75 |
| ఎల్ఐసీ | 2022 | 20,557.23 |
| పేటీఎం | 2021 | 18,300 |
| టాటా కేపిటల్ | 2025 | 15,511.87 |
| కోల్ ఇండియా | 2010 | 15,200 |

ప్రధానంగా ఎస్‌బీఐ 2.48 కోట్లు, ఎంఎస్ స్ట్రాటజిక్ (మారిషస్) లిమిటెడ్ 1.60 కోట్ల షేర్ల చొప్పున విక్రయించనున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో ఎస్‌బీఐకి 3.23%, అనుబంధ సంస్థ ఎస్‌బీఐ కేపిటల్ మార్కెట్స్‌కు 4.33 శాతం వాటాలు ఉన్నాయి.

ఎన్‌ఎస్‌ఈలో 10.82 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ఎల్ఐసీ ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎటువంటి షేర్లను విక్రయించడం లేదు.

ఎన్‌ఎస్‌ఈ మార్కెట్ విలువ సుమారు రూ.5 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ఐపీఓలో 6 శాతం వాటాను ప్రస్తుత వాటాదార్లు విక్రయిస్తుండటంతో ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండొచ్చని లెక్కగడుతున్నారు.

ఇష్యూ ధరల శ్రేణి రూ.2000 దరిదాపులో ఉండొచ్చని బ్యాంకర్లు అంచనా వేస్తున్నాయి.

జియో ఐపీఓ వస్తే.. రెండో స్థానానికి

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు కూడా సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఇష్యూ పరిమాణం రూ.37,700 కోట్లుగా ఉండొచ్చని చెబుతున్నారు. జియో కంటే ముందే ఎన్‌ఎస్‌ఈ ఐపీఓనే వచ్చే అవకాశం ఉండటంతో.. దేశంలో ఇప్పటివరకు అతి పెద్ద ఐపీఓగా ఎన్‌ఎస్‌ఈదే అవుతుంది. ఆ తర్వాత జియో ఐపీఓ వచ్చాక... ఈ సంస్థదే అతిపెద్ద ఐపీఓగాను, ఎన్‌ఎస్‌ఈ ఐపీఓ రెండో స్థానంలో ఉంటుంది.

# 4 రోజుల తర్వాత మళ్లీ లాభాలు

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,112 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు: రూ.8,930 కోట్లు**



నాలుగు రోజుల వరుస నష్టాల నుంచి దేశీయ సూచీలు శుక్రవారం బలంగా పుంజుకున్నాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో లోహ, ప్రైవేట్ బ్యాంకులు, చమురు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 పైసలు పెరిగి 94.43 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.40% తగ్గి 95.14 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.17 లక్షల కోట్లు పెరిగి రూ.488.25 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 505 పాయింట్ల లాభం (క్రితం ముగింపు 76,152.86 పాయింట్లు)తో 76,657.02 వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 76,883.14 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.25 పాయింట్లు పెరిగి 23,897.70 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,895.85- 24,005.75 పాయింట్ల మధ్య చలించింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 లాభపడ్డాయి. టాటా స్టీల్ 2.91%, రిలయన్స్ 1.61%, బజాజ్ ఫైనాన్స్ 1.47%, ట్రెంట్ 1.34%, అదానీ పోర్ట్స్ 1.33%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.30%, కోటక్ బ్యాంక్ 1.15%, అల్ట్రాటెక్ 1.11%, టైటన్ 1.01% రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.24%, హెచ్‌సీఎల్ టెక్ 1.24%, ఎటర్నల్ 1.09% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 1.42%, హౌసింగ్ ఫైనాన్స్ 1.41%, టెలికాం 1.39%, బీమా 1.37% మెరిశాయి. స్థిరాస్తి, యంత్ర పరికరాలు, వాహన, ఆరోగ్య సంరక్షణ, హాస్పిటల్స్, ఐటీ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 2388 షేర్లు లాభపడగా, 1991 స్క్రిప్‌లు నష్టపోయాయి. 251 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్‌లో ప్రమోటర్లయిన ఆజాద్ మూపెన్, ఆయన కుటుంబ సభ్యులు తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచుకున్నారు. దాదాపు రూ.350.34 కోట్లతో 0.57 శాతం వాటాలను కొనుగోలు చేశారు. దీంతో సంస్థలో వీరి మొత్తం వాటా 24.58 శాతానికి చేరింది.

ఐపీఓ సమాచారం

ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబరు 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.139-146 నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ427 కోట్లు సమీకరించనుంది.

కరంతారా ఇంజినీరింగ్ రూ.875 కోట్ల ఐపీఓ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.241-254 నిర్ణయించారు. గరిష్ఠ ధర ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.8174 కోట్లుగా నమోదుకావొచ్చు.

రెంటోమోజో రూ.1256 కోట్ల ఐపీఓ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ధరల శ్రేణి రూ.384-404.

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ రూ.805 కోట్ల ఐపీఓ 9న ప్రారంభమై 11న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.322-339 నిర్ణయించారు.

# క్యారట్ తో వెరైటీ వంటకాలు:వడలు..

## పోలేలు..మురబ్బా ఇలా చేయండి..బలానికి బలం..టేస్ట్ అదిరిపోవాల్సిందే..!



క్యారెట్ తో వంటకాలంటే..కొన్ని రకాల కూరలు, అప్పుడప్పుడు పచ్చళ్లు తప్ప ఇంకేం చేస్తాం అనుకుంటాం. కానీ యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్లు పుష్కలంగా ఉండే క్యారెట్లతో ఇంకా బోలెడు వెరైటీ వంటలు ట్రై చేయొచ్చు. నోట్లో వేసుకోగానే కరిగిపోయే స్వీట్లతో పాటు గరంగరం వడలు, పోలేలు, మురబ్బావండుకోవచ్చు. ఇవి రుచి తోపాటు ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు వీటిని ఎలా తయారు చేయాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

మరిన్ని కనుగొనండి
సైంటిస్ట్ ఉద్యోగాలు
హైదరాబాద్ న్యూస్
జిల్లా వార్తలు

క్యారట్ వడలు తయారీకి కావలసినవి
క్యారెట్ తురుము – ఒక కప్పు
ఉల్లిగడ్డ తరుగు – అర కప్పు
పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్
కారం– అర టీ స్పూన్
పసుపు – పావు టీస్పూన్
ధనియాల పొడి – ఒక టీ స్పూన్
జీలకర్ర– అరటీ స్పూన్
ఇంగువ – చిటికెడు
కరివేపాకు–రెండు రెమ్మలు
శెనగపిండి– ఒక కప్పు
ఉప్పు– తగినంత
నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

క్యారట్ వడలు తయారీ విధానం

క్యారెట్ తురుము, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర, ఇంగువ, కరివేపాకు, ఉప్పు, పసుపు గిన్నెలో వేసి బాగా కలపాలి.

తర్వాత అందులో శెనగపిండి కూడా వేసి మరోసారి కలపాలి(క్యారిటీ తురుము, ఉల్లిగడ్డ తరుగులోని తడి వల్ల పిండి ముద్దలా అవుతుంది. అందుకని ప్రత్యేకంగా నీళ్లు కలపాల్సిన అవసరం లేదు).

ఇప్పుడు ఆ మిశ్రమాన్ని కొంచెం కొంచెం తీసుకుని చేత్తో వడల్లా వత్తి మరిగే నూనెలో వేసి డీప్ ఫ్రై చేయాలి. అంతే టేస్టీగా ఉండే క్యారట్ వడలు తయారీ..

క్యారట్ పోలేలు తయారీకి కావాల్సినవి
క్యారెట్ తురుము – ఒక కప్పు
మైదా– ఒకటిన్నర కప్పు
చక్కెర – అర కప్పు
యాలకుల పొడి– అర టీ స్పూన్
నెయ్యి– రెండు టేబుల్ స్పూను
ఉప్పు – చిటికెడు

క్యారెట్ పోలేలు తయారీ విధానం

ముందుగా మైదాలో ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోసి చపాతీ పిండిలా కలిపి పక్కనపెట్టాలి. ఇప్పుడు పాన్ లో నెయ్యి కరిగించి క్యారెట్ తురుము వేసి వేగించాలి. అందులో చక్కెర, యాలకుల పొడి కూడా వేసి దగ్గర పడ్డాక స్టవ్ ఆపాలి.

కలిపి పెట్టిన పిండిని కొంచెం కొంచెం తీసుకుని చిన్న సైజు పూరీలా వత్తి మధ్యలో క్యారెట్ మిశ్రమం పెట్టి మళ్లీ పోలేల్లా వత్తాలి. ఆపై వాటిని పెనంపై రెండు వైపులా నెయ్యితో కాల్చితే నోరూరించే క్యారెట్ పోలేలు రడీ.. పిల్లలే కాదు.. పెద్దలు కూడా లొట్టలేసుకుంటూ ప్లేట్ ఖాళీ చేస్తారుగా..!

క్యారట్ మురబ్బా తయారీకి కావలసినవి
క్యారెట్ – అర కేజీ
నిమ్మరసం– పావు కప్పు

క్యారట్ మురబ్బా తయారీ విధానం

క్యారట్ లను చక్రాల్లా తరిగి మధ్యలో చాకుతో రంధ్రాలు చేయాలి. ముక్కల్ని ఐదునిమిషాలు నీళ్లలో ఉడికించి... గిన్నెలోకి తీయాలి పాన్‌లో సరిపడా నీళ్లు పోసి చక్కెర వేసి తీగపాకం రెడీ చేయాలి. అందులో క్యారెట్ ముక్కలు కూడా వేసి సన్నని మంటపై ఉడికించాలి. పాకం క్యారెట్ ముక్కలకు బాగా పెట్టాక స్టవ్ ఆపాలి. తర్వాత అందులో నిమ్మరసం వేసి కాసేపు చల్లర్చి తగలని డబ్బాలోకి తీసి నిల్వ చేయాలి. ఇవి తింటే సూపర్ గా ఉంటాయి.

# ఆధ్యాత్మికం: శరీరం వెదురు వేణువులాంటిది..

## మీలో ఎవరు దాగి ఉన్నారో తెలుసుకోండి..!

వెదురు లోపల మొత్తం ఖాళీగా ఉంటుంది. మనం రెస్ట్ తీసుకుంటున్నప్పుడు, కూడా మన శరీరాన్ని వెదురు కట్టెలాగా ఫీలవ్వాలి శరీరాన్ని వెదురులా పీలయినప్పుడు.. శరీరం లోపలంతా ఖాళీగా మారుతుంది. చర్మం, ఎముకలు, రక్తం అన్ని ఈ వెదురులో భాగమే! వాటి లోపల ఉన్న ఖాళీలో ఒక పవిత్రత ఉంటుంది. దీని గురించి ఓషో ప్రత్యేకంగా వివరించారు.

నోరు తెరువకుండా నిశ్శబ్దంగా కూర్చొని ఏ పని చేయకుండా నాలుక పైకప్పుకు తాకుతూ మనసులో ఎలాంటి ఆలోచనల అలజడి లేకుండా ఉన్నప్పుడు ప్రత్యేకంగా దేనికోసం వేచి ఉండకుండా... శరీరం అంతా వెదురులా ఖాళీగా అనిపించినప్పుడు అకస్మాత్తుగా.. అనంతమైన శక్తి మనలోకి ప్రవహిస్తుంది. అది మనకు తెలియని, రహస్యమైన దైవశక్తితో నిండి ఉంటుంది. అప్పుడు ఆ వెదురు లాంటి శరీరం.. వేణువులా మారుతుంది. తర్వాత అది అందంగా మోగుతుంది! ఎప్పుడైతే మనం ఖాళీగా మారుతామో అప్పుడు దైవత్వం మనలోకి ప్రవేశించడానికి ఎలాంటి అడ్డుగోడలూ ఉండవు. వెదురుగా మారే ధ్యానం... అందమైన ధ్యానాల్లో ఒకటి. దీనికోసం ప్రత్యేకంగా ఏం చేయనవసరం లేదు. ఇది వెంటనే జరిగిపోతుంది.

ఈజీగా

ఈజీగా రెస్ట్ తీసుకోండి. ఎలాంటి ఆధ్యాత్మిక కోరికలు కోరుకోవద్దు. స్వర్గాన్ని కోరుకోవద్దు. దైవభక్తిని కూడా కోరుకోవద్దు ఎందుకంటే.. దైవభక్తిని కోరుకోలేం. కోరిక లేకుండా ఉన్నప్పుడే.. అది వస్తుంది...

విముక్తి కోరుకోలేం.. అది కోరికల బందాల్లో చిక్కుకొని ఉంటుంది.

ఎప్పుడైతే మనం కోరికలు లేకుండా ఉంటామో అప్పుడే విముక్తి పొందుతాం. జ్ఞానోదయాన్ని కోరుకోలేం. ఎందుకంటే దానికి కోరికే అవరోధం! అవరోధం లేనప్పుడు, అకస్మాత్తుగా బుద్ధుడు మనలో ప్రవహిస్తాడు. మీ దగ్గర ఇప్పటికేవిత్తనం ఉంది.

శరీరం ఖాళీగా ఉన్నప్పుడు. స్పేస్ ఏర్పడుతుంది. అప్పుడు ఆ విత్తనం మొలకెత్తుతుంది. ఖాళీ వెదురులాగా విశ్రాంతి తీసుకోవాలి. ఇవ్వడానికి ఏమీ లేదు, పొందటానికి ఏమీ లేదు. ఇచ్చే అవసరం లేదు. తీసుకునే అవసరమూ లేదు. ఇప్పుడు ఎలా ఉన్నారో. అలాగే ఫర్ పెక్ట్ గా ఉన్నాం అనుకోండి చాలు

# బెల్లో ఐటీఐ అప్రెంటిస్ ఖాళీలు..అప్లయ్ చేసుకోండిలా




భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), బెంగళూరు కాంప్లెక్స్ షార్ట్?టర్మ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్(2026---27) కింద ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ పోస్టులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు (సదరన్ రీజియన్ రాష్ట్రాలు) అభ్యర్థులు మాత్రమే అర్హులు. తెలంగాణవార్తలు

పోస్టు పేరు: ఐటీఐ అప్రెంటిస్.

విభాగాలు: ఎలక్ట్రానిక్ మెకానిక్, ఈపీ, డీఎంఎం, ఫిట్టర్, సీఓపీఏ, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రిషియన్.

విద్యార్హత: ఎన్?సీవీటీ లేదా ఎస్?సీవీటీ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసి ఉండాలి. 2022, జనవరి 01 లేదా ఆ తర్వాత ఐటీఐ పాసైన వారు మాత్రమే అర్హులు. ఫైనల్ ఇయర్/ ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారు అర్హులు కాదు.

వయసు: 2025, సెప్టెంబర్ 01 నాటికి గరిష్ట వయసు 21 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయసు సడలింపు ఉంటుంది.

స్టైపెండ్ (నెలసరి వేతనం): ఫిట్టర్, డీఎంఎం, ఎలక్ట్రిషియన్, టర్నర్, ఈపీ, ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడ్‌లకు నెలకు రూ. 11,040, సీఓపీఏ, వెల్డర్ ట్రేడ్‌లకు నెలకు రూ. 10,040 చెల్లిస్తారు.

అప్లికేషన్: ఆన్?లైన్ ద్వారా.

వాక్–ఇన్ సెలెక్షన్ షెడ్యూల్

సెప్టెంబర్ 25: ఎలక్ట్రానిక్ మెకానిక్, ఈపీ ట్రేడ్‌లకు.

సెప్టెంబర్ 26: డీఎంఎం, ఫిట్టర్, సీఓపీఏ, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లకు.

వేదిక: సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు – 560013.

# చందమామ మన వెంటే...

హాయ్ ఫ్రెండ్స్.. మనం రాత్రిపూట చందమామను చూస్తూ బోలెడు కబుర్లు చెప్పుకొంటాం కదా! ‘అదుగో చూడు చందమామ నా వెంటే వస్తున్నాడు అంటే.. నా వెంటే వస్తున్నాడు’ అని తెగ అల్లరి చేసేస్తాం. మరి చందమామ మన వెంట ఎందుకు వస్తున్నాడు? అసలు నిజంగానే మనం వెళ్లిన వైపే ప్రయాణిస్తాడా? తెలుసుకుందామా!

సాధారణంగా మనం ప్రయాణం చేసేటప్పుడు, నడుస్తున్నప్పుడు చెట్లు, స్తంభాలు, ఇళ్లు.. ఏవైనా వెనక్కి వెళ్తున్నట్లుగా అనిపిస్తాయి. ఎందుకంటే అవి మన కంటికి చాలా దగ్గరగా ఉంటాయి. అలాగే వాటి మీద మన దృష్టి కోణం కూడా చాలా వేగంగా మారిపోతుంది. దాన్ని మన మెదడు స్పష్టంగా గుర్తిస్తుంది. ఉదాహరణకు మనం కారులో ప్రయాణిస్తుంటే దగ్గరగా ఉన్న చెట్లు వేగంగా వెనక్కి పరిగెత్తినట్లుగా అనిపిస్తుంది. కాస్త దూరంగా ఉన్న భవనాలు, స్తంభాలు మెల్లగా కదులుతున్నట్లుగా కనిపిస్తాయి. అంటే మనం ప్రయాణం చేస్తున్నప్పుడు మన కంటికి కనిపించే వస్తువుల దూరాన్ని బట్టి, అవి వెనక్కి వెళ్లే వేగం మారుతుంది. దీన్నే ‘పారలాక్స్ ఎఫెక్ట్’ అంటారు. ఇక చందమామ విషయానికి వస్తే.. భూమికి చందమామ కొన్ని లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అంత ఎక్కువ దూరంలో ఉండటం వల్ల మనం రోడ్డు మీద ఎన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించినా, చందమామను చూసే దృష్టి కోణంలో మార్పు.. మనం గుర్తించలేనంత సూక్ష్మంగా ఉంటుంది. దాంతో.. ‘చుట్టుపక్కల ఉన్నవన్నీ వెనక్కి వెళ్లిపోతున్నాయి.. చందమామ మనం ఎటు వెళ్తే, అటువైపే వస్తుంది’ అనే భ్రమను మనకు మన మెదడు కల్పిస్తుంది. దీన్ని ‘ఆప్టికల్ ఇల్యూజన్’ అంటారు. అయితే సూర్యుడి విషయంలో కూడా ఇదే జరుగుతుంది. కానీ మనం సూర్యుణ్ని









# కలలోనూ అనుకోలేదు

మిథాలి రికార్డును బద్దలుకొట్టడంపై స్మృతి

దుబాయ్: మహిళల అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ నెలకొల్పిన రికార్డును తాను బద్దలు కొడతానని కలలోనూ అనుకోలేదని భారత ఓపెనర్ స్మృతి మంధాన పేర్కొంది. గురువారం హాంకాంగ్‌తో ఆసియా కప్ మ్యాచ్‌లో సెంచరీ (124) కొట్టిన స్మృతి.. అత్యధిక అంతర్జాతీయ పరుగుల (10,880)తో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో మిథాలి (10,868)ని ఆమె అధిగమించింది. ఈ నేపథ్యంలో స్మృతి మాట్లాడుతూ.."నేను బ్యాటింగ్ చేస్తున్నపుడు ఈ రికార్డు గురించే తెలియదు. ప్రపంచ రికార్డు సరిగ్గా ఎన్ని పరుగులకు అన్నదానిపైనా అవగాహన లేదు. మిథాలి భారత క్రికెట్లో ఒక దిగ్గజం. మాకందరికీ మార్గదర్శకురాలు. ఆమె ఆటను చూస్తూ పెరిగా. పరుగుల్లో ఆమెను దాటడం అన్నది కలలోనూ ఊహించలేదు. టాప్-2లో ఇద్దరూ భారతీయులే ఉండడం నాకెంతో ఆనందాన్నిస్తోంది" అని చెప్పింది. ఈ మ్యాచ్‌లోనే స్మృతి అత్యధిక అంతర్జాతీయ శతకాలు (18) సాధించిన బ్యాటర్‌గానూ రికార్డు నెలకొల్పింది. ఆమె ఆస్ట్రేలియా బ్యాటర్ మెగ్ లానింగ్ (17)ను దాటింది.

# వైభవ్ సూర్యవంశీ ఉన్నాడనే.. నా భార్య క్రికెట్ చూస్తోంది: క్రిష్

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై (దీఁవతీ ఝఅఎష్ట్రుఝజ ూశీశీతీఝఋఝఅంష్ట్రఱ) మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ కుర్రాడు తన అద్భుతమైన నైపుణ్యంతో క్రికెట్ ప్రపంచాన్ని ఆకట్టుకున్నాడని అభినందించాడు. చివరకు తన భార్య కూడా వైభవ్ ఉన్నాడనే దులీప్ ట్రోఫీని చూస్తున్నట్లు పేర్కొన్నాడు. దులీప్ ట్రోఫీ సెమీస్‌లో వైభవ్ మెరుగైన బ్యాటింగ్‌తో తన జట్టును గెలిపించిన సంగతి తెలిసిందే.

19నుంచి డబ్ల్యూఏపీఎల్

"వైభవ్ ఆట అత్యద్భుతం. అతడిని నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉండాలి. ఈ కుర్రాడిని సరిగ్గా తీర్చిదిద్దితే రాబోయే కాలంలో సూపర్‌స్టార్‌గా మారతాడు. టెస్టు క్రికెట్‌కూ వైభవం తీసుకొస్తాడు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ దులీప్ ట్రోఫీని చూడటానికి కూడా కారణం అతడే. నా భార్య కూడా వైభవ్ ఉన్నాడనే మ్యాచ్‌లు చూస్తోంది. ప్రపంచ క్రికెట్‌కు అతడు పెద్ద ఆస్తిగా మారతాడు. దేశవాళీలోనూ వైభవ్ ఆటను చూశాం కదా.. ఇలాంటి కుర్రాడికి ఉన్నతస్థాయి క్రికెట్ ఆడగల సామర్థ్యం ఉందా? అని ఎవరైనా సందేహిస్తారా? అతడు ఎక్కడైనా ఆడగలడు. త్వరలోనే అన్ని ఫార్మాట్లలో ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తాడు. రెడ్‌బాల్ క్రికెట్‌లోనూ పేస్ బౌలింగ్‌లో ఏమాత్రం భయం లేకుండా స్ట్రెయిట్ సిక్స్‌లు కొట్టడం అద్భుతం" అని క్రిష్ వెల్లడించాడు.

వైభవ్‌కు ముంగిట అరుదైన రికార్డు

తాజాగా దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ లాన్ డ్రి ప్రిటోరియస్.. నమీబియాపై సూపర్ సెంచరీ సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత పిన్న వయస్కుడైన సెంచరీ హీరోగా మారాడు. 20 ఏళ్ల 161 రోజుల వయసులో ప్రిటోరియస్ ఈ ఘనత సాధించాడు. అంతకుముందు వరకూ ఈ రికార్డు అఫ్గాన్ బ్యాటర్ హజ్రతుల్లా జజాయ్ (20ఏళ్ల 337 రోజులు) పేరిట ఉండేది. ఇప్పుడు ఆ ఘనతను సాధించే సదావకాశం వైభవ్ (ఝఅఎష్ట్రుఝజ ూశీశీతీఝఋఝఅంష్ట్రఱ)కు ఉంది. ప్రస్తుతం వైభవ్ వయసు 16 ఏళ్ల లోపే. రాబోయే మ్యాచుల్లో ఒక్కసారి క్రీజ్‌లో కుదురుకుని సెంచరీ చేస్తే ప్రపంచ రికార్డు సొంతమవుతుంది. 90ంలోకి వచ్చాక కాస్త సంయమనం పాటిస్తే చాలు.. ఈ ఘనతను తన ఖాతాలో వేసుకొనే అవకాశం వైభవ్‌కు ఉందని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.



# ఆసియా కప్.. భారత్ హ్యాట్రిక్ విజయం.. పాక్ చిత్తు



దుబాయ్: మహిళల ఆసియా కప్‌లో భారత్ హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. ఇప్పటికే సెమీస్ చేరిన టీమ్ఇండియా.. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత పాక్ 55 పరుగులకే కుప్పకూలగా.. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 8.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. షెఫాలి వర్మ (12), హర్మన్‌ప్రీత్ (18లి), దీప్తి శర్మ (12లి) పరుగులు చేశారు. మంధాన (9), ప్రతీకా రావల్ (4) రన్స్ చేశారు.తొలుత భారత బౌలర్ల ధాటికి పాక్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మనోళ్ల బౌలింగ్ ధాటికి పాక్ 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా వారంతా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. భారత బౌలర్లలో శ్రీచరణి (3/7), ప్రేమ రావత్ (3/9) సత్తాచాటారు. దీప్తి శర్మ 2, షెఫాలి వర్మ ఒక వికెట్ పడగొట్టారు. పాకిస్థాన్ జట్టుకు టీ20ల్లో ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. అంతకుముందు పాక్ 2024లో న్యూజిలాండ్‌పై 56 పరుగులకు ఆలౌటైంది.
















# విజయ్‌కు థాంక్స్ చెప్పిన అజిత్




తమిళనాడులో క్రీడా మౌలిక వసతుల కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై అగ్రకథానాయకుడు అజిత్ కుమార్ ) హర్షం వ్యక్తం చేశారు. చెన్నైలో అధునాతన 'ఒలింపిక్ సిటీ'తో పాటు మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి విజయ్‌కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ చర్యలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. "నేను మోటార్ స్పోర్ట్స్‌లో చురుగ్గా పాల్గొంటాను. ఈ సందర్భంగా వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చెప్పిన ఒక కొటేషన్‌ను మార్చి చెప్పాలనుకుంటున్నా. 'తమిళనాడు ప్రభుత్వం వేసిన ఈ ఒక్క చిన్న అడుగు.. భారత మోటార్‌స్పోర్ట్స్ రంగానికి ఒక పెద్ద ముందడుగు'. ముఖ్యమంత్రి విజయ్ చేపట్టే ప్రతి ప్రయత్నం విజయవంతం కావాలని ఆశిస్తున్నాను. ముఖ్యంగా క్రీడా రంగంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలన్నీ గొప్ప విజయం సాధించాలి" అని అజిత్ పేర్కొన్నారు. ఈ ఒలింపిక్ సిటీ గురించి విజయ్ గురువారం అసెంబ్లీలో ప్రకటించిన సంగతి తెలిసిందే. తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ ఒలింపిక్ సిటీలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణాలు, అత్యాధునిక శిక్షణ పరికరాలు, హై-పెర్ఫార్మెన్స్ ట్రెనింగ్ సెంటర్లతో పాటు స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇక, రేసింగ్ అంటే అజిత్‌కు మహా ఇష్టం. సినిమా చిత్రీకరణ నుంచి బ్రేక్ దొరికితే చాలు బైక్స్, కార్లతో చక్కర్లు కొడుతుంటారు. మోటార్ సైకిల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ఆయన ఓ స్టార్టప్‌ను ఏర్పాటు చేశారు. 'అజిత్‌కుమార్ రేసింగ్' పేరుతో టీమ్‌ను కూడా ప్రకటించిన విషయం తెలిసిందే.



# వెంకటేశ్, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' విడుదలపై నాగవంశీ క్లారిటీ

వెంకటేశ్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47'. ఈ మూవీ విడుదల వాయిదా పడుతుందంటూ వస్తున్న వార్తలపై నిర్మాత నాగవంశీ స్పష్టత ఇచ్చారు. ఇంతకు ముందు ప్రకటించిన విధంగానే అక్టోబరు 2న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసురానున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. రాబోయే నెలరోజులు సర్‌ప్రైజ్‌లు ఉంటాయని అన్నారు. వచ్చేవారం మొదట్లో టీజర్, ఆ తర్వాత ఫస్ట్ సింగిల్, చివరి వారంలో ట్రైలర్ విడుదల చేస్తామని చెప్పారు. కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వెంకటేశ్ చిట్టిబాబు పాత్రలో కనిపించనున్నారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా చూడాలని ఎదురు చూసిన ప్రేక్షకులకు 'ఆదర్శ కుటుంబం'తో ఆ కల నెరవేరనుంది.

# రష్యా-ఉక్రెయిన్ వార్ నేపథ్యంలో మోహన్‌లాల్ సినిమా..

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ నటిస్తున్న 367వ చిత్రానికి ఆసక్తికరమైన టైటిల్ ఖరారైంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో అక్కడ చిక్కుకుపోయిన వేలాది మంది భారతీయ విద్యార్థులు, పౌరులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన మిషన్ స్ఫూర్తితో.. ఈ చిత్రానికి 'ఆపరేషన్ గంగా' ) అనే పేరును ఖరారు చేశారు. 'మెప్పడియాన్' చిత్రంతో ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డు అందుకున్న విష్ణు మోహన్ ఈ భారీ ప్రాజెక్టును తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌లాల్‌తో పాటు బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, భాగ్యశ్రీ బోర్సే, పార్థిబన్, ఆదిల్ హుస్సేన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇది కేవలం ఒక రెగ్యులర్ ఆర్మీ నేపథ్య చిత్రం కాదని, పలు వాస్తవ సంఘటనల కలయికగా ఈ సినిమా తెరకెక్కుతోందని దర్శకుడు ఇటీవల స్పష్టం చేశారు. ఈ చిత్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణుల బృందం పనిచేస్తోంది. 'పుష్ప' ఫేమ్ మిరోస్లావ్ కుబా బ్రోజెక్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. 'కిల్', 'ధురంధర్' లాంటి యాక్షన్ చిత్రాలకు పనిచేసిన దక్షిణ కొరియా ఫైట్ మాస్టర్ సీ యంగ్ ఓహ్ ఈ సినిమాకు యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ గోకులం మూవీస్ పతాకంపై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జార్జియాలో జరుగుతోంది. త్వరలోనే




Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com